క్లుప్తంగా

ఆర్కేవ్యాలీలో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటీలో దేశప్రధాని పిలుపు మేరకు విద్యార్థులతో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ట్రిపుల్ఐటీ క్యాంపస్‌లోని పరిసరాల్లో శుభ్రత పాటించి, చెత్త, ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్-14, 15 ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జి.తిరుపతిరెడ్డి, డాక్టర్ మధుసూధన, విద్యార్థి వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురిజాల విద్యార్థుల ఎంపిక

సింహాద్రిపురం : రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు గురిజాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 2వ తేదీన రాయచోటిలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో జడ్పీహెచ్ఎస్ గురిజాల విద్యార్థులు రాంచరణ్, శ్రీకాంత్‌లు అత్యంత ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ విక్టర్ తెలిపారు. వీరు ఈనెల 9వ తేదీన విశాఖపట్నం అరకులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరి ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అవినీతి దేశాభివృద్ధికి ప్రధాన అవరోధం


ర్యాలీలో పాల్గొన్న ఆర్టీపీపీ సీఈ నాగరాజు

ఎర్రగుంట్ల : అవినీతి అనేది దేశాభివృద్ధికి ప్రధాన అవరోధమని దానిని నివారించాలని ఆర్టీపీపీ సీఈ నాగరాజు తెలిపారు. ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ వారి ఉత్తర్వుల మేరకు శనివారం ఆర్టీపీపీలో ఏపీఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలతోపాటు ర్యాలీని నిర్వహించారు. ప్రతి ఉద్యోగి తన కర్తవ్య విధులను నైతిక విలువలతో నిజాయతీగా నిర్వహించాలని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్ రాధాకృష్ణ, అడ్మిన్ ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ సిద్దయ్య, ఎస్ఈలు, డీఈలు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అటవీ శాఖ స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామంలో ఉన్న అటవీశాఖ స్థలాన్ని శనివారం రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ సెక్రటరీ ఎర్రసాని మధుసూదన్ రెడ్డి పరిశీలించి మాట్లాడారు. ఈ అటవీ శాఖ స్థలం రెండు ఎకరాలకు పైగా ఉంటే ప్రస్తుతం ఎకరా 30 సెంట్లు మాత్రమే ఉండి మిగతా స్థలం కొంత సమాధులకు మరికొంత ఆక్రమణలకు గురైందన్న విషయం తెలియడంతో పరిశీలించానన్నారు. ఈ స్థలంలో గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు ఇక్కడ చిన్న పిల్లల పార్కు, అదేవిధంగా పెద్దలు వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ఎస్టిమేషన్ వేయాలని డీఎఫ్ఓకు ఆదేశించానన్నారు. సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్ఆర్‌సీపీ టౌన్ కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు రూ.35 లక్షలు మంజూరు

చెన్నూరు : రామనపల్లి గ్రామపంచాయతీలో తాగునీటి పైప్‌లైన్‌కు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి రూ.35 లక్షలను మంజూరు చేసినట్లు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. ఇక్కడ తాగునీటి సమస్య ఉన్న విషయాన్ని గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ పుత్తా వేణుగోపాల్‌రెడ్డి, నేను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన నిధులను మంజూరు చేయించారని ఆమె తెలిపారు.

ఎండుగడ్డి కొరతతో పశుపోషకుల కలత

- ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు
- 17 మెట్రిక్ టన్నులకు ప్రతిపాదనలు పంపాము
- డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు


ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్న ఎండుగడ్డి

పులివెందుల రూరల్ : ఇటీవల కాలంలో వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్రాల వినియోగం బాగా పెరిగింది. వీటివల్ల కూలీల కొరతను అధిగమించే అవకాశం ఉండటంతో పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఖర్చులు, పనిభారం తగ్గినా పాడి పరిశ్రమకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలతో కోతలు చేపట్టడం వల్ల వరి గడ్డి వృధాగా పోతోంది. దీనికితోడు ఈ ఏడాది పంట సమయంలో అధిక వర్షాలు కురవకపోవడంతో వరిగడ్డికోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పశువులు పెంచేందుకు ఎండుగడ్డిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వరికోతలు చేపట్టి కుప్పలుగా వేసి తూర్పారపట్టేవారు. వాటి ద్వారా వచ్చే ఎండుగడ్డిని నిలువ చేసి ఏడాది పొడవునా పశువులకు మేత వేసేవారు. మెట్టప్రాంత రైతులు నదులు, చెరువులు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో బోరు ఆధారంగా పండించిన వరిపంట ఎండుగడ్డిని కొనుగోలు చేసి దాచుకునేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి కనిపించడంలేదు. ఈ సమయంలో ప్రభుత్వం పశువుల దానాలకు పూర్తి రాయితీ ప్రకటిస్తే పశువుల మేతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు తెలుపుతున్నారు. ఒక్కొక్క పశువుకు రోజుకు పచ్చిగడ్డి 30 కిలోలు, ఎండుగడ్డి 5 నుంచి 10 కిలోలు అవసరం. ప్రస్తుతం ఎండుగడ్డిని వేంపల్లె, నందిమండలం, ప్రొద్దుటూరు, అనంతపురం జిల్లాల నుంచి ట్రాక్టర్ ఎండుగడ్డిని రూ.15 వేల నుంచి రూ.20వేలతో కొనుగోలు చేస్తున్నారు.

నియోజకవర్గంలో 48 వేల పాడిపశువులు : పులివెందుల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 48 వేలకు పైగా పశువులు పెంచుతున్నారు. ప్రస్తుతం ఎండుగడ్డి అందుబాటులో లేకపోవడంతో పశువులను అమ్మేయాలన్న ఆలోచనలో కొంతమంది ఉన్నారు. ఈ ప్రాంతంలో కూడా పాడిరైతులు ఎక్కువ మంది ఉన్నారు.

17 మెట్రిక్ టన్నులకు ప్రతిపాదనలు పంపాం



పులివెందుల ప్రాంతానికి సంబంధించి పశుగ్రాస క్షేత్రంలో గడ్డిని పెంచే రైతులకు విత్తనాలు అందించడం కోసం ప్రభుత్వానికి 17 మెట్రిక్ టన్నులకు ప్రతిపాదనలు పంపామని, 7 టన్నులు రైతులకు పంపిణీ చేశామని, 10 టన్నులు వచ్చిన వెంటనే అర్హులైన రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తాం. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేలలో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ ద్వారా విత్తనాలను సరఫరా చేస్తుంది.

– డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

టన్ను రూ.40 వేలు పలికిన చీనీ ధర


మార్కెట్‌యార్డులో చీనీకాయల వేలంపాటలో పాల్గొన్న చైర్మన్ చిన్నప్ప

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో చీనీకాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో మార్కెట్‌కు చీనీకాయలు తరలించే రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల ప్రాంతంలోని రైతులకు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు ప్రత్యేక శ్రద్ధతో చీనీకాయల కొనుగోలు కేంద్రాలతో పాటు చీనీకాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పులివెందుల ప్రాంతంలో పండించిన చీనీకాయలను రైతులు మార్కెట్‌కు తరలించి విక్రయాలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పులివెందులలోని చీనీకాయల మార్కెట్‌లో మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప చీనీ మార్కెట్‌లోని వేలంపాటను పరిశీలించి మాట్లాడారు. చీనీకాయలు టన్ను ధర రూ.40,300లు ధర పలికిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పులివెందులలో చీనీకాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

సీఎం చిత్రపటానికి జర్నలిస్టుల పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

పులివెందుల టౌన్ : రాష్ట్రంలో పనిచేస్తున్న అక్రిడియేషన్ జర్నలిస్టులందరికీ 0.03 సెంట్ల ఇళ్ల స్థలాలను ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదని వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి విలేకరులందరు కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలోని లోపాలను ఎత్తిచూపి దిశనిర్దేశం చేసే జర్నలిస్టులు వ్యక్తిగతంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను గుర్తించి ఇళ్లస్థలాలను మంజూరు చేయడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, గౌరవ అధ్యక్షుడు మారుతి, వివేక్‌యాదవ్, కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణారెడ్డి, కోశాధికారి ఓంప్రకాష్, ఉప కోశాధికారి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సేవకే.. భరోసా కేంద్రాలు


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రైతులకు సేవ చేయటానికే ప్రతి గ్రామ పంచాయతీలలో రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం చిన్నదండ్లూరులోని రైతు భరోసా కేంద్రాన్ని, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతులు వారికి వచ్చే సబ్సిడీ కోసం అధికారుల చుట్టు తిరిగేవారన్నారు. ఇప్పుడు మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులకు గ్రామాలలోని సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట నమోదు లాంటివి అందుతున్నాయన్నారు. రైతుల వద్దకే అధికారులు వెళ్లి వారికి అందాల్సిన పథకాలను అందించే మహోత్తరమైన వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అలాగే వైఎస్సార్ విలెజ్‌క్లినిక్‌లతో గ్రామాలలోని ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రధాన సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఉప మండలాధ్యక్షుడు పొన్న శ్రీను, ఎంపీటీసీ సభ్యులు సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వినాయకనగర్ కాలనీలోని సున్నపుబట్టి వీధిలో సురక్ష ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డిలు ప్రారంభించి మాట్లాడారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకులైన సురేష్(కర్త), రఘురాముడులకు ఎమ్మెల్యే రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. వినాయకనగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ వాసులకు ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికులే దేవుళ్లు


ప్రశంసా పత్రాలను అందుకున్న ఆదర్శ ఉద్యోగులు

పులివెందుల రూరల్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు సంస్థకు దేవుళ్లలాంటి వారని ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఏపీఎస్ఆర్టీసీ నూతన డిపోలో ప్రతిభ కనపరిచిన ఉద్యోగులతో అభినందన సభ ఏర్పాటు చేసి వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కినప్పుడు మర్యాదపూర్వకంగా పలకరిస్తూ గౌరవించాలన్నారు. విధినిర్వహణలో అత్యధిక పీకేకే ఎంపీఎల్ తెచ్చిన ఉద్యోగులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రతిభ కనపరిచిన ఉద్యోగులకు ప్రతినెల అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు. ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేసి సంస్థకు ఆదాయం తెచ్చే విధంగా పనిచేయాలన్నారు. అక్టోబర్ నెలకు సంబంధించి ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన నాగార్జున, గంగయ్య, గోపీనాథ్, దస్తగిరి, శశి, ఎల్.ఆర్.ఎన్.రెడ్డి, ఆర్.ఎస్.రెడ్డి, ఎం.ఎస్.రెడ్డి, సుబ్బయ్యలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కుల్లాయప్ప, మెకానికల్ ఫోర్‌మెన్ శ్రీకాంత్, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే సరిచేసుకోండి


పులివెందులలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు


పెద్దదండ్లూరులో ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న బీఎల్ఓలు

పులివెందుల టౌన్ : నూతనంగా వచ్చిన ఓటర్ జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే సరిచేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రం పాఠశాలలో నిర్వహించిన క్యాంపులో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు ఓటరు జాబితాలతో అందుబాటులో ఉంటారని, ఓటరు జాబితాలో అభ్యంతరాలు, తప్పొప్పులు ఉంటే సరిచేసుకునేందుకు వీలుందన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు బీఎల్ఓలు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకుని సరిచేసుకోవాలన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు సవరించుకోవాలన్నారు. 2024 జనవరి 5వ తేదీ నాటికి పూర్తి ఓట్ల జాబితా అందుబాటులోకి వస్తుందన్నారు. అలాగే డిసెంబర్ 2, 3వ తేదీలలో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసి ఓటర్లకు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : మండల పరిధిలోని గ్రామాలలో ఓటర్ల జాబితాను విడుదల చేశామని స్థానిక ప్రజలు జాబితాను చూసుకోవాలని తహసీల్దార్ గురప్ప తెలిపారు. శనివారం స్థానిక బీఎల్ఓల ద్వారా గ్రామాలలో ఓటర్ల జాబితాను విడుదల చేశారు. అనంతరం 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రెండు చోట్ల ఓటర్లుగా నమోదు అయి ఉంటే వారు ఎక్కడ కావాలో అక్కడ మాత్రమే ఓటర్లుగా ఉండాలన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని 59 పోలింగ్ స్టేషన్లలో ఓటు నమోదు కోసం శనివారం నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో అన్ని పోలింగ్ స్టేషన్లలో బీఎల్వోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉన్నారు. ఓటర్లు ఫారం-6కు 97 దరఖాస్తులు అందజేశారు. అలాగే ఫారం-7కు 77, ఫారం-8కు 91 దరఖాస్తులు అందజేసినట్లు తహసీల్దార్ సరస్వతి తెలిపారు. కాగా 27, 29, 30 పోలింగ్ స్టేషన్లలో ఆమె ప్రత్యేక కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్నికల డీటీ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

కమలాపురం : వైఎస్సార్ జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్, ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం వారు కమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. ఈశాన్య నైరుతి పవనాల ద్వారా తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో సాధారణ సాగు విస్తీర్ణానికి కూడా నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 103 కరువు మండలాల జాబితాలో జిల్లాలో ఒక్క మండలం కూడా లేదన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మక్కాకు బయలుదేరిన మైనార్టీలు


ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో నివాసం ఉండే 41 మంది ముస్లిం సోదరులు శనివారం మక్కాకు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

వలంటీర్ సేవ


హైదరాబాద్‌లో శ్రీదేవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాగసుధ

కొండాపురం : తాళ్లప్రొద్దుటూరు గ్రామ సచివాలయం-2లో దీర్ఘకాలికంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ తన బంధువు ఇంటిలో ఉన్న బెల్లంకొండ శ్రీదేవికి వలంటీర్ ఎస్.రాగసుధ హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు.